కోల్‌కతా ఘటనకు నిరసనగా నేడు ర్యాలీ

సికింద్రాబాద్,ఆగస్టు18: కోల్‌కతా లోని జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచారానికి నిరసనగా సోమవారం నిరసన చేపట్టనన్నట్లు సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతాఫల్‌మండి కుట్టి వెళ్లోడి యూపీ హెచ్‌సీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కావునా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభాకర్‌కు పరామర్శ

ఇటీవల తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి పడిన ప్రమాదంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్ తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ప్రభాకర్‌ను ఆదివారం ఎన్‌డీఎంఏ మాజీ చైర్మన్, మాజీ మంత్రి, బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి ప్రభాకర్‌ను రామంతాపూర్‌లోని తన నివాసంలో కలిసి పరామర్శించారు. –బేగంపేట్,ఆగస్టు18:

నాన్‌టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఏళ్ల తరబడి నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు సూర్యచందర్, అంజయ్య, వెంకటేశ్, వీరేశం, శ్రీకాంత్, రాము, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 18 : పద్మారావునగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో పార్కులో ఉన్న వనదేవత ఆలయానికి బోనం, తొట్టెలు సమర్పించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. లష్కర్ జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు పవన్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జై సింహ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సలహాదారుడు చంద్రశేఖర్, అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చక్రధర్ యాదవ్ పాల్గొన్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట : అడ్డగుట్ట కురుమ సంఘం ఆధ్వర్యంలో శాస్త్రి నగర్‌లోని బీరప్ప స్వామి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘం మహిళలు డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించారు. ఈ పూజ కార్యక్రమంలో తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు.

రాంగోపాల్‌పేట్‌లో..

బేగంపేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కళాసీగూడలోని శ్రీ జూలమ్మ దేవాలయం, నల్లగుట్టలోని శ్రీ భ్రమరాంబిక, సుందరమ్మ, నల్లగుట్ట జూలమ్మ, నల్లగుట్ట కనకదుర్గ, కాచ్‌బౌలిలోని నల్లపోచమ్మ, హైదర్‌బస్తీలోని మంకాలమ్మ, ప్యారడైజ్ సర్కిల్ లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో అమ్మవార్ల దేవాలయాలని అమ్మవారిని బంతిపూలు, వేపాకులతో ముస్తాబు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయాల్లో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, విజయ్, సతీశ్, కిశోర్, అరుణ్, చందుచారి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అడ్డగుట్టలో బోనాల వేడుకల్లో పాల్గొన్న తుకారాంగేట్ సీఐ శంకర్ నాయక్

కళాసీగూడలోని జూలమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బొల్లారం,ఆగస్టు 18: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం డౌటన్ బజార్‌లో పెనుయేలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేశ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేశ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న పెనుయేలు ఫౌండేషన్ నిర్వాహకులను, ప్రతినిధులను అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ శిబిరంలో రక్త, ఈసీజీ, డెంటల్, జనరల్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని నిర్వాహకులు పాస్టర్ ఓరీన్ తెలిపారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పెనుయేలు ఫౌండేషన్ ప్రతినిధులు, మాజీ వైస్ ప్రెసిడెంట్ జయ ప్రకాశ్, మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు నరసింహన్,బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ తెప్పోత్సవం

గంగ తెప్పోత్సవంలో పాల్గొన్న సికింద్రాబాద్ గంగపుత్రులు

సికింద్రాబాద్,ఆగస్టు 18: ఖైరతాబాద్‌లో జరిగిన తెలంగాణ గంగ తెప్పోత్సవం బోనాల ఉత్సవాల కార్యక్రమానికి సికింద్రాబాద్ నుంచి పెద్ద ఎత్తున గంగపుత్రులు తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం వారాసిగూడ చౌరస్తా, సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి ప్రత్యేక బస్సుల్లో గంగపుత్ర సంఘం నాయకులు,మహిళా నేతలు తరలివెళ్లి నెక్లెస్ రోడ్డులో గంగమ్మ గుడి వద్ద జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు, జలపందిరి సమర్పించినట్లు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, ఎర్రబోయిన మల్లేశ్, ముఠా గణేశ్, నగరపు శ్యామ్, సందిరి నవీన్, పూస రాజ్‌కుమార్, పంపరి యాదగిరి, కూర మల్లికార్జున్, శివ, శ్రీనివాస్, సంజీవ్, ముద్రగడ గిరి తదితరులు తరలి వెళ్లారు.

బెంగాల్ ఘటనపై నిరసన

ఖైరతాబాద్ : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఆకృత్యాన్ని ఖండిస్తూ ఆదివారం సాయంత్రం ఖైరతాబాద్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ సేవా కేంద్రం నుంచి బడా గణేశ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద స్త్రీ ముక్తి లీగ్ నౌజవాన్ భారత్ సభ, దిశా స్టూడెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తాధ్వర్యంలో నిరసన తెలిపారు.

బాలుర హాస్టల్‌ను ప్రారంభించాలి

ఖైరతాబాద్, ఆగస్టు 18 : కాచిగూడ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను పునః ప్రారంభించాలని బాలుర హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సలహాదారులు, బీఆర్ఎస్వీ వ్యవస్తాపక సభ్యులు బొమ్మర రామమూర్తి, కమిటీ అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ.. 1972లో అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు హయాంలో నింబోలిఅడ్డలో బాలుర హాస్టల్‌ను ప్రారంభించారని, నాటి నుంచి ప్రతి ఏడాది 500 నుంచి 600 మంది విద్యార్థులు ఇందులో ఉండి చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించారన్నారు. ఇదే హాస్టల్‌లో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహా, ఎంపీ ఈటల రాజేందర్ లాంటి వారు ఉండి చదువుకున్నారన్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ హాస్టల్ మూతపడడంతో శిథిలావస్తకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోవడం లేదని, బీసీ, ఎస్సీ హాస్టళ్లకు మెస్ చార్జీలు నిధులు ఇవ్వడం లేదన్నారు. హాస్టల్‌ను తెరిపించాలని ప్రజాప్రతినిదులు, ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేదన్నారు. ఈ నెల 31లోగా హాస్టల్‌ను తెరిపించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పూర్వ విద్యార్థుల కమిటీ సలహాదారు డి. సంగమేశ్వర్, ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బి గోవింద్, సహాయ కార్యదర్శులు రమేశ్, ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కె. రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

సమావేశంలో అభివాదంచేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ ఓదెల అజేయ్, కమిటీ సభ్యులు

నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

మారేడ్‌పల్లి, ఆగస్టు 19: రెజిమెంటల్‌బజార్ లోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయం అనుబంధ ఆలయం అయిన సంతోషిమాత ఆలయంలో సోమవారం అమ్మవారి 42వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మహేందర్, చైర్మన్ ఓదెల అజేయ్ తెలిపారు. ఇప్పటికే జయంతి ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనవల్సిగా వారు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

అమ్మ వారికి ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్,ఆగస్టు18: శ్రావణ మాసం లోను భక్తులు అమ్మ వారికి తమ మొక్కలు చెల్లిస్తున్నారు. చిలకలగూడ పార్కులో ఉన్న అమ్మ వారి ఆలయంలో ఆదివారం భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి బోనం సమర్పించారు. మొక్కులను తీర్చుకున్నారు.

20 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

అమీర్‌పేట్, ఆగస్టు 18 : బంజారాహిల్స్ లోని కళింగ కల్చరల్ హాల్‌లో హ్యాండ్ టూ హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శన ఈ నెల 20 నుంచి జరగనుంది. ఇందుకు సంబంధించి సన్నాహాక కార్యక్రమంలో భాగంగా ఆదివారం బేగంపేట్ కంట్రీ క్లబ్‌లో హ్యాండ్ లూమ్ కలెక్షన్ థీమ్ ఫ్యాషన్ షో నిర్వహించారు. ఈ ఫ్యాషన్ షోలో అందాల సుందరీమణులు కంచి, బెనారెస్, సిల్క్, పోచంపల్లి, అపూర్వ కలెక్షన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వస్త్ర ప్రదర్శన నిర్వాహకులు గుప్తా మాట్లాడుతూ పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటి తరం కూడా ఈ ఉత్పత్తులను ఎంతగానో ఆదరిస్తున్నారని 24 వరకు బంజారాహిల్స్ లోని కళింగ హాలులో జరిగే ఈ ప్రదర్శనకు 14 రాష్ట్రాలకు చెందిన చేనేతకారులు, చేతి పని బృందాలు, తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తారన్నారు.

దోపిడీలేని సమాజానికి పోరాడాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: దోపిడీ లేని సమాజానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సమాజ ఉన్నతికి మరింత బాధ్యతతో కొనసాగాలని సూచించారు. ఇటీవలి జూనియర్ లెక్చరర్, గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలు సాధించిన ఎకానమిక్స్ విద్యార్థులతో కలిసి ఎంవీఎన్ ఎకానమిక్స్ సక్సెస్ మీట్ – 2024ను ఆదివారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ రాములు అధ్యక్షత వహించగా, నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ ఎకానమిక్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ మీనయ్య అందించే ఉచిత శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించిన అరవై మందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి మనిషి వ్యక్తిగత వృద్ధి లేకపోవుటకు కారణం దోపిడీని, దోపిడీ లేని వ్యవస్థ నిర్మాణానికి వారి బోధన ఉపయోగపడాలని కోరారు. దేశాభివృద్ధి కొంత మంది వ్యక్తులకు, కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాల ప్రజానీక సమస్యల పరిష్కారం కోసం తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ సమాజంలో రాజకీయాలు, విద్యాబోధన వ్యాపారమవుతున్న ఈ కాలంలో మానవీయ విలువలు కలిగిన మీనయ్య వంటి వాళ్లు ఎంతో ఆదర్శంగా ఉండడం గర్వకారణమన్నారు. నడుస్తున్న కాలంలో స్పందించే గుణం కరువైతున్న తరుణంలో ఇలాంటి సమావేశాలు జరగడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ నంద్యాల నర్సిరెడ్డి, కామ్రేడ్ జూలకంటి రంగారెడ్డి, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్లు డైనీ, ఉపేందర్, ఇంద్రకాంత్, శివారెడ్డి, గణేశ్, కొండల్, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ దుబ్బ రంజిత్, నరేందర్, ప్రవళిక, సుల్తానా, రాఘవేంద్ర, కిరణ్, సైదులు, దీపిక, ఎల్లస్వామి, అరవింద్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మేటిక్స్‌లోని విభాగాలతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషియాలజీ విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం

నిరుపేద కుటుంబంలో జరుగుతున్న వివాహానికి సనత్‌నగర్ బీజేపీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ ఆర్థిక సహాయాన్ని అందించారు. సనత్‌నగర్‌కు చెందిన షేక్ యాకుబ్ సోదరి వివాహానికి శుభాకాంక్షలు చెబుతూ ఆదివారం తన కార్యాలయంలో రామ్మోహన్ ఈ చెక్కును అందజేశారు.

–అమీర్‌పేట్, ఆగస్టు 18

పవర్ బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు

అమీర్‌పేట్, ఆగస్టు 18 : బల్కంపేట బస్తీలో ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ. 6 లక్షల వ్యయంతో పవర్ బోర్ వేశారు. బీజేపీ నాయకుల చొరవతో ఈ బోరు వేశారు. అసలే నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న తమకు ఈ పవర్ బోర్ నిర్మాణంతో కొరత తీరిందని బస్తీ వాసులు సంతోషించారు. బోరు నిర్మాణం, ఆ వెంటనే ఓ దిమ్మెను నిర్మించి, దానిపై ట్యాంకును ఏర్పాటు చేసి దానికి నల్లాలు కూడా బిగించారు. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ బోర్, మండు వేసవిలో తమకు నీటి కటకట లేకుండా చేస్తుందని బస్తీవాసులు ఆనందించారు. మరి కొద్ది రోజుల్లోనే అధికారులు మీటర్‌ను కూడా తీసుకువచ్చారు. పవర్ బోరును, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కేతినేని సరళ, జిల్లా బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ పవర్ బోర్‌కు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలన్న విషయాన్ని కార్పొరేటర్ సహా బీజేపీ నాయకులే కాక అధికారులు కూడా మరిచారు. దీంతో ఈ పవర్ బోర్ కోసం తీసుకువచ్చిన మీటర్, అందుకు అవసరమైన విద్యుత్ తీగలను ఈ బోరు పక్కన గోడపై వేసి ఎవరి దారి వారు చూసుకున్నారు. ఆరు నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఎవరూ ఈ పవర్ బోర్ ఊసెత్తడం లేదు.

పవర్ బోర్ నీటి కోసం నిర్మించిన ట్యాంక్

వెంటనే పరిశీలిస్తాం

ఈ పవర్ బోర్‌కు కరెంట్ కనెక్షన్ విషయాన్ని పరిశీలిస్తాం.నిర్మాణం జరిగిన తరువాత ఈ బోర్‌ను జలమండలికి బదలాయించాల్సి ఉంది. అది జరిగిందా లేదా చూసి వెంటనే అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

–రామచంద్రారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్

సమావేశంలో నినాదాలు చేస్తున్న సమితి ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 21న భారత్‌బంద్

ఖైరతాబాద్, ఆగస్టు 18 : ఎస్సీ, ఎస్టీ విభజనను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి కన్వీనర్ డి. సర్వయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కో కన్వీనర్లు జి. చెన్నయ్య, చెరుకు రాంచందర్‌తో కలిసి మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు భారతదేశంలోని యావత్ దళితులు, బహుజనులు, ఆదివాసీ వర్గాల మనోభావాలపై ప్రభావం పడిందన్నారు. మాలలకు మొదటి నుంచి అన్యాయం జరుగుతూనే ఉందని, ఎస్సీ కార్పొరేషన్ పదువులు, ప్రభుత్వ పథకాలు మాదిగలకే దక్కుతున్నాయని, గురుకుల పాఠశాలల్లో మాలలకు ప్రాధాన్యత లేదన్నారు. 21న నిర్వహించే ధర్నాలో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని అన్నారు. న్యాయమైన ఉద్యమాలు చేసి ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామన్నారు. త్వరలోనే వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కోకన్వీనర్లు బల్వంత్, తాళ్లపల్లి రవి, జంగా శ్రీనివాస్, బాలకిషన్, సుధీర్, లింగస్వామి పాల్గొన్నారు.

మురుగు పరుగు

ఎర్రగడ్డ, ఆగస్టు 18: బోరబండ బస్టాండ్ మీపంలోని మెయిన్ రోడ్డు మురికి కూపంగా మారింది. వారంలో ఐదు రోజులు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పొంగి పొర్లడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్‌లోని పీజేఆర్ విగ్రహానికి చేరువలో ఉన్న మూడు మ్యాన్‌హోళ్ల నుంచి పెద్ద మొత్తంలో మురుగు నీరు పొంగి పొర్లి రోడ్డుపైకి చేరుతున్నదని అన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు మెయిన్‌రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూనే ఉన్నది. నెలలో 20రోజులు ఇదే పరిస్థితి తలెత్తుతున్నదని మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు.

విద్యుత్ సీఎండీకి అభినందనలు

వెంగళరావునగర్, ఆగస్టు 18: విద్యుత్ శాఖకు చెందిన సుమారు 3 వేల మందికి విద్యుత్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పదోన్నతులు కల్పించారు. దీంతో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 నాయకులు సీఎండీని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 తరుపున ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సీఎండీని కోరినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్, కె.శ్రీనివాస్ తెలిపారు. పదోన్నతులు సాధించినందుకు సంతోషంగా ఉందని, సహకరించిన సీఎండీతో పాటు యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వజీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.